# నగరంలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత



12

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు

అభివృద్ధి పనులను నాణ్యతతో, సకాలంలో పూర్తి చేయాలి

ఖమ్మం బాలాజీనగర్‌లో రూ. 90 లక్షల సుడా నిధులతో సీసీ డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




## ఖమ్మం


శనివారం 10 అక్టోబర్ 2026 పేజీలు : 8


## ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో

# నిర్లక్ష్యం వహిస్తే చర్యలు




- అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలి
- నిర్దేశించిన నమూనాలో వాస్తవ సమాచారంతో నివేదికలు సమర్పించాలి
- ఎల్-2, ఎల్-3, ఎల్-0, కొత్త దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి
- స్లాబ్ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి
- గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్

2



## దుకాణంలో గడువు ముగిసిన మాజా బాటిళ్లు

### వినియోగదారుల ఆరోగ్య భద్రతపై ఆందోళన.

### ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించాలి!.

**పాలేరు ఆర్.సి అక్టోబర్ 9 ప్రజా జ్యోతి**

ప్రజారోగ్య పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారా?ఒక దుకాణంలో మాజా పానీయాల విక్రయాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూసుమంచి మండల కేంద్రంలోని ఓ ఊరు పేరు లేని ఓ టీ స్టాల్ లో గడువు ముగిసిన మాజా బాటిళ్లను యదేచ్ఛగా అమ్మకాలు జరుపుతున్నారు. దీనిపై వినియోగదారుడు సంబంధించిన టీ స్టాల్ నిర్వాహకుడిని నిలతీయగా కావాలంటే బాటిల్ మార్చుతాం - మిగతా2లో

## కందుకూరు -వెంకటాపురం రోడ్డులో

# ఘోర ప్రమాదం





### నుజ్జుయిన కారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

వివరాలు13లో

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి

# కొంత స్థలం అవసరం

- స్కూల్ అభివృద్ధి కొరకు భూములు కావాలి
- ఖమ్మం ఆర్డీవో నక్క శ్రీనివాస్
- స్కూల్ అభివృద్ధికి మా పట్టా భూములు కావాలా?
- ఆర్డీవోను ప్రశ్నించిన రైతులు
- పక్కనే ఖాళీ స్థలం ఉండగా మా భూములు ఎందుకు
- మా పట్టా భూములు ఇవ్వము
- ఆర్డీవోకు తేల్చి చెప్పిన రైతులు

**బోనకల్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):**

మండల పరిధిలోని లక్ష్మీ పురం రెవిన్యూ పరిధిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూలుకు మరికొంత స్థలం అవసరం ఉందని - మిగతా3లో



# ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన నివేదికలను నిర్దేశించిన నమూనాలో వాస్తవ సమాచారంతో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వాస్తవ వివరాలు సమర్పించకుండా నిర్లక్ష్యం వహిస్తే సమీక్షలు కొనసాగించడంతో పాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో పథకం అమలుకు ఎవరు బాధ్యత వహిస్తున్నారో స్పష్టంగా నిర్ధారించుకొని, ప్రతి అధికారి తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.మండల స్థాయిలో ఎంపీడీవోలదే పూర్తి బాధ్యత,మండల స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు ఎంపీడీవోలు పూర్తి బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హౌసింగ్ ఏఈలు ఎంపీడీవోల సమన్వయంతో పనిచేయాలని, సర్వే వివరాల సేకరణ, నివేదికల సమర్పణ,క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అర్హులైన దరఖాస్తులను ఎల్-1 జాబితా లోకి తీసుకురావాలి.ఎల్-1 జాబితాలోని దరఖాస్తులను గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2 జాబితాలోని దరఖాస్తుదారుల అర్హత, భూమి పత్రాల లభ్యతను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలు సమన్వయంతో పరిశీలించి, అర్హులైన వారిని నిబంధనల ప్రకారం ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని సూచించారు.భూమి పత్రాలు లేవనే కారణంతో అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం సరికాదని కలెక్టర్ పేర్కొన్నారు. భూమి ప్రభుత్వ భూమా, ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన భూమా, లేక అభ్యంతరాలు లేని ఇతర భూమా అనే అంశాలను సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని నిర్ధారించాలని తెలిపారు. స్థానిక సర్పంచ్‌లు,గ్రామ పెద్దలతో చర్చించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. భూమికి సంబంధించిన యాజమాన్య పత్రాలు అందుబాటులో లేకపోయినా, నిబంధనలకు అనుగుణంగా విద్యుత్ బిల్లులు,ఇతర ఆధారాలను పరిశీలించి,మిగిలిన అర్హతలు సరిపోతే దరఖాస్తులను ఎల్-1 స్థాయికి పంపించాలని ఆదేశించారు. ఈ అంశాలపై శిక్షణ సమయంలోనే స్పష్టమైన సూచనలు జారీ చేశామని తెలిపారు.ఎల్-0,ఎల్-3, కొత్త దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి.ఎల్-3 జాబితాలో ఉన్న లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారిని ఎల్-1 జాబితాలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఎల్-2, ఎల్-3, ఎల్-0 జాబితాల్లోని దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన వారిని ఎల్-1 స్థాయికి తీసుకురావాలని సూచించారు.ఎల్-0, కొత్త దరఖాస్తుల వివరాలను నిర్దేశించిన నమూనాలో తయారు చేసి హౌసింగ్ పీడీకి పంపాలని ఎంపీడీవోలను ఆదేశించారు.ఇందుకోసం అన్ని మండలాలకు ఒకే విధమైన నమూనాను రూపొందించాలని సూచించారు.గెజిటెడ్ అధికారుల పరిశీలన అనంతరం అర్హులైన ఎల్-1 దరఖాస్తులు కలెక్టర్ లాగిన్‌కు చేరుతాయని, అనంతరం సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి విచారణ వివరాలు, స్పష్టమైన సిఫార్సులు, సమర్థన నివేదికలను కలెక్టర్‌కు భౌతికంగా సమర్పించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కలెక్టర్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ నిర్వహించి సిఫార్సులు పంపించాలని సూచించారు.స్లాబ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలి.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్లాబ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.బేస్‌మెంట్ స్థాయిలో ఉన్న ఇళ్లకు చెల్లించే 25 శాతం మొత్తానికి సంబంధించి స్లాబ్ విస్తీర్ణ నిబంధనలను పాటించాలని తెలిపారు.నిబంధనలకు అనుగుణంగా స్లాబ్ వేయని ఇళ్లకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఈ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో ప్రత్యేకంగా మీడియా సమావేశాలు నిర్వహించాలని, స్లాబ్ నిబంధనలపై ప్రత్యేక పత్రికా ప్రకటన విడుదల చేయాలని ఆదేశించారు.మొదటి విడతలో ఎల్-3 జాబితా నుంచి ఇళ్లు మంజూరై, క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులు ప్రారంభించి, పనుల వివరాలు నమోదు చేసిన లబ్ధిదారులకు ఒకేసారి మినహాయింపుగా ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందని తెలిపారు. అయితే పనులు ప్రారంభించని, నిర్మాణ వివరాలు నమోదు కాని ఇళ్లకు ఈ మినహాయింపు వర్తించదని స్పష్టం చేశారు.ఇలాంటి ఇళ్ల లబ్ధిదారులు ప్రస్తుతం నిర్మాణ పనులు ప్రారంభించకుండా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా గుర్తించిన ఇళ్లకు సంబంధించి ఈ సమాచారం లబ్ధిదారులకు తప్పనిసరిగా చేరాలని సూచించారు. అర్హత పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం ఎల్-1 జాబితాలోకి మార్పు జరిగిన తరువాతే తదుపరి నిర్మాణ పనులకు సంబంధించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన తరువాత కూడా పనుల్లో పురోగతి లేకపోతే సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సంబంధిత హౌసింగ్ ఏఈలు, తహసీల్దార్లు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి రెండు పడక గదుల ఇళ్ల వాస్తవ పరిస్థితులను నమోదు చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఫలితాలు సాధించాలి.ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రాధాన్యతను క్షేత్ర స్థాయి సిబ్బంది అర్థం చేసుకొని బాధ్యతా యుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించి పనుల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఇందిరమ్మ ఇళ్ల నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు,ఎంపీడీవోలు,హౌసింగ్ ఏఈలు,తల్లాడ,రఘునాథ పాలెం,ఖమ్మం అర్బన్, మధిర తహసీల్దార్లు, ఈడీఎం దుర్గాప్రసాద్,ఇందిరమ్మ ఇళ్ల ఆపరేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

## దుకాణంలో గడువు ముగిసిన మాజా బాటిళ్లు.

-మొదటిపేజీ తరువాయి

అంటూ నిర్లక్ష్యంగా సమాధానమే చెప్పడం కాకుండా గడువు ముగిసిన బాటిల్ లు తమ షాపులో ఉన్నట్లు తమకు ముందే తెలుసు అనడం కోస మెరుపు. పానీయాల బాటిళ్లపై ముద్రించిన గడువు తేదీలను పరిశీలించకుండా విక్రయాలు జరిపితే వినియోగదారుల ఆరోగ్య భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు ఇలాంటి శీతల పానీయాలను ఎక్కువగా వినియోగించే నేపథ్యంలో దుకాణదారులు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుకునే స్థితికి దిగజారారు.

**గడువు ముగిసిన మాజా బాటిళ్ల విక్రయాలపై ఆందోళన!**

కూసుమంచి మండలంలో ఫుడ్ సెఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడంతో, గడువు ముగిసిన బాటిల్ లు అని తెలిసి కూడా విక్రయాలు చేస్తున్నారు. అంటే దుకాణదారులు ప్రజారోగ్యంతో చెలగాటం అడడమే అనిపిస్తుంది.. నిరంతరం అధికారుల తనిఖీలు చేపట్టాల్సి ఉన్న తనిఖీలు లేకపోవడంతో యదేచ్చగా గడువు ముగిసిన పానీయాలను అమ్ముతున్నారు. వినియోగదారుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన దుకాణాల్లో గడువు తేదీలను సరిగ్గా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై విచారణ చేపట్టి సదరు షాపు పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కొంత స్థలం అవసరం

-మొదటిపేజీ తరువాయి

ఖమ్మం ఆర్డిఓ నక్క శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ పక్కనే గల భూములుగల గోవిందపురం రైతులతో ప్రత్యేక సమావేశాన్ని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూల్ అభివృద్ధి కొరకు మరి కొంత స్థలం కావాలని రైతులను కోరారు. స్కూల్ నిర్మాణానికి స్థలం సరిపోక తప్పనిసరిగా అడగాల్సి వచ్చిందని అన్నారు. దీంతో రైతులు తీవ్రంగా స్పందించారు. ఈ సమావేశానికి 15 మంది రైతులు హాజరు కాగా అందరూ ముక్తకంఠంతో లక్ష్మీపురంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ అభివృద్ధి కొరకు మా పట్టా పొలాలు కావాల్సి వచ్చిందా, పక్కన చాలా ఖాళీ స్థలం ఉందని, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నిర్మించుకోవచ్చని, మా పట్టా భూమిని ఎందుకు అడుగుతున్నారని ఆర్డీవోను నిలదీశారు. అధికారులు మాకు తెలియకుండా, మేము ఇంటి దగ్గర లేనప్పుడు వచ్చి సర్వేలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. మా పొలాలు తీసుకొని మా పొట్ట కొట్టడం మీకు న్యాయంగా ఉందా అని నిలదీశారు. పక్కన ఖాళీ స్థలం లేకపోతే మా పొలాలు ఇవ్వమని అడిగితే సమంజసం గా ఉంటుందని రైతులు అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలుకు పక్కన రోడ్డు అవతల చాలా ఖాళీ స్థలం ఉండగా పట్టా భూమి గల రైతుల పొలాలే మీకు కావాల్సి వచ్చిందాని ఆర్డీవోను ప్రశ్నించారు. ఏదిఏమైనా మేము పంటలు పండించుకునే మా పట్ట పొలాలు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఆ వెంటనే రైతులు సమావేశం నుంచి అర్ధాంతరంగా ఆవేశంతో వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మండల తాహసిల్దార్ చల్లూరి సుధాకర్, గిర్దావర్ 1 సామినేని నరసింహారావు, గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోర్ర అచ్చయ్య మృతి.



**కారేపల్లి, అక్టోబర్ 09, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని రొట్టమాకు రేవు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బో ర్ర అచ్చయ్య(90) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రేగుల గూడెం సర్పంచ్ మూతి వీరస్వామి, ఉప సర్పంచ్ ఆవు వెంకటేశ్వర్లు, నాయకులు అడ్డగోడ ఐలయ్య తో పాటు పలువురు ప్రముఖులు, నాయకులు అచ్చయ్య మృతదేహానికి పూలమాల లేసి ఘన నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## రానున్న యాసంగిలో 6తడి పంటలు మాత్రమే వేయాలి..

### ఏ.డి.ఏ శ్రీనివాస్ రెడ్డి



**సత్తుపల్లి అక్టోబర్09(ప్రజా జ్యోతి)** రానున్న యాసంగి సీజను లో వరి కి బదులుగా ప్రత్యామ్నయ ఆరుతడి పంటల సాగు చేపట్టాలని సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం అయ్యగారి పేట గ్రామంలో ఆత్మ పధకము లో భాగము గా ప్రత్యామ్నాయ పంటల సాగు,ఆయిల్ పామ్ పంటల సాగు, సమతూల్య ఎరువులు, నీటి యాజమాన్యం,కలుపు నివారణ చర్యలు పై జరిగిన రైతు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన హాజరై, అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ నినో నేపద్యం లో లోటు వర్షపాతం , అధిక ఉష్ణోగ్రతలు వలన భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఉన్నాయని ,కావున ప్రత్యామ్నాయ ఆరు తడి పంటల సాగు చేయాలని కోరారు. ఈ రైతు శిక్షణా కార్యక్రమం లో పాల్గొన్న వ్యవసాయ కళాశాల శాస్త్ర వేత్తలు డా.నాగాంజలి, డా. నీలిమ, డా.రామ్ ప్రసాద్ లు మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక సాగు పద్ధతులు, వాతావరణ మార్పుల ప్రభావం, పంటల వైవిధ్యీకరణ,ఆరోగ్య పరిరక్షణ, ఆయిల్‌పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, వ్యవసాయ శాఖ పథకాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు చల్లగుండ్ల కృష్ణయ్య ఉపాధ్యక్షులు గాదే చెన్నారావు ,బొంతు వేణు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు వ్యవసాయ విస్తరణాధికారులు నరేష్, ఆశా జ్యోతి,అనూష, దీప్తి, మరియు రైతులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష తగదు

### పెన్షనర్లు ఉద్యమానికి సిద్ధం కండి: ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య



**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) అక్టోబర్ 9:** ఐదు నెలలు గడచినా అట్టహాసంగా ప్రారంభించిన న్యూహెల్త్ స్కీమ్ అడుగు ముందుకు పోవటంలేదని, రెండేళ్ళు ఆలస్యంగా మంజూరు చేసిన డిఏ ముప్పైమూడు వాయిదాలు ఇవ్వటం, ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు చెల్లింపులో విపరీత జాప్యం పెన్షనర్ల పట్ల వివక్షకు నిదర్శనాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య విమర్శించారు.
శుక్రవారం ఎస్జిపిఏటి జిల్లా కార్యాలయం కృషిభవన్ లో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది.
సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య మట్లాడుతూ ప్రభుత్వం వయోవృద్ధులైన పెన్షనర్ల సమస్యల పట్ల సత్వరం స్పందించి పరిష్కరించాలని కోరారు.
హెల్త్ కార్డులు అప్లోడ్ చేసిన పెన్షనర్ల కార్డులు రావటం లేదని,భార్య భర్తలలో ఒకరికి వచ్చి ఒకరికి కార్డు రాని వందలాది పెన్షనర్లు మనోవేదనకు గురవుతున్నారని,ఉద్యోగుల హెల్త్ కార్డు లకు ఇచ్చిన ఎడిట్ ఆప్షన్ పెన్షనర్లకు ఇవ్వటం లో విపరీత జాప్యం, హెల్త్ కార్డు వచ్చినప్పటికి వైద్యం చేయని వైద్యశాలలు, హెల్త్ కార్డు అప్లోడ్ చేయటానికి పెన్షను పేపరు కావాలనటం ఇవన్నీ వయోవృద్ధులైన పెన్షనర్ల పట్ల ప్రభుత్వ వివక్షగా పెన్షనర్లు భావిస్తున్నారని, ఇప్పటికైనా హెల్త్ కార్డులు, వైద్య సమస్యల గురించి పెన్షనర్ల సంఘాలతో సమావేశం నిర్వహించి పరిష్కరించాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.
సమావేశం ముందుగా ఇటీవల మరణించిన పెన్షనర్లు, ప్రముఖులకు సంతాపంగా మౌనం పాటించింది. సమావేశంలో నూతనంగా విశ్రాంత ప్రిన్సిపాల్ సారాబు శ్రీనివాసరావు, విశ్రాంత అధ్యాపకులు ఉప్పల శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కొలిపాక శ్రీదేవి, కొర్రా శివ ఎస్జీపిఏటి సభ్యత్వం తీసుకొన్నారు.
సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వి మేరిఏసుపాదం, జిల్లా నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాలశ్రీనివాసరావు, బోజెడ్ల కృష్ణకుమారి, కొలికొండ శరత్ బాబు, జల్లా వెంకటేశ్వర్లు, బెల్లం రాధాకృష్ణ మూర్తి, పివిఆర్కెవిప్రసాదరావు, గండ్లూరి కృష్ణారావు, ఊడుగు సుధాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

### ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్

**ఖమ్మం ప్రజా జ్యోతి** ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ డిమాండ్ చేశారు. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని, బీజేపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం నిలవాలంటే ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని పేర్కొన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ పిలుపు మేరకు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిర్వహించ తలపెట్టిన సత్యాగ్రహ దీక్షలో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డితో కలిసి వేజండ్ల సాయికుమార్ ఈరోజు ఢిల్లీలోని యువజన కాంగ్రెస్ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ఓటు హక్కు పవిత్రతను పరిరక్షించాలని, ప్రజాస్వామ్య విలువలకు భంగం



కలగకుండా చర్యలు తీసుకోవాలని సాయి డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజాస్వా మ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదా రీతనం ఉండే వరకు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# నారాయణ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు







**సత్తుపల్లి అక్టోబర్ 09(ప్రజా జ్యోతి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, సత్తుపల్లిలోని కాకర్లపల్లి రోడ్డు లో గల నారాయణ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పూల పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణం రంగు,రంగుల పూలతో, పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. తల్లిదండ్రులు సైతం కార్యక్రమంలో భాగస్వాములై వేడుకలకు మరింత శోభను చేకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఐక్యతాభావాన్ని, సామాజిక స్పృహను, మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు అందరిలో ఆనందోత్సాహాలను నింపాయి. సంప్రదాయాల పరిరక్షణలో విద్యాసంస్థల పాత్రను చాటిచెప్పిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. సంస్కృతి సాంప్రదాయాలకు భారతదేశంలోని ముఖ్యమైనదని, అలాంటి సంస్కృతి సాంప్రదాయాలను, రాబోయే భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.జీ.ఎం రామ్‌కీ , ఆర్.ఐ క్రాంతి , కోఆర్డినేటర్లు వినోద లక్ష్మి , నీలిమ, వైస్ ప్రిన్సిపాల్స్ రమ్య,దివ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేట్ ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభించిన

# ఎర్రుపాలెం బిఆర్ఎస్ మండల కమిటీ



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** వరంగల్--ఖమ్మం--నల్గొండ నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ మండల కమిటీ సభ్యులు ఓటర్ల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎర్రుపాలెం సర్దార్ జమలాపురం కేశవరావు మెమోరియల్ కళాశాల నందు లెక్చరర్ లకు మరియు ప్రజ్ఞ స్కూలు ఉపాధ్యాయులకు మరియు ప్రతిభ స్కూల్ ఉపాధ్యాయులకు ఫామ్ 18 అందజేశారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలని పార్టీ నాయకులు, ఓటర్లకు. సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పిస్తూ, అవసరమైన సహకారం అందించుతామని తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు కీలకమైనందున అర్హులైన పట్టభద్రులందరి వివరాలను సేకరించి నమోదు చేయించే దిశగా బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలని మండల కమిటీ సభ్యులు సూచించారు. ఎర్రుపాలెం మండలం లోని ఉన్న గ్రాడ్యుయేట్లను సంప్రదించి, నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన నేపథ్యంలో మండల కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడువు లోపు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, అర్హులైన వారందరి వివరాలను నమోదు చేయించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా టీం ఈ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్‌లో చురుగ్గా పాల్గొని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌తో దరఖాస్తు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు శ్రీపాలిశెట్టి తిరుపతిరావు గద్దల శ్రీనివాసరావు షేక్ బాబు సా సుభాని నాగమల్లేశ్వరరావు తదితరులు చేసిన పాల్గొన్నారు

# వెంకటాపురం బడిలో బతుకమ్మ సంబరాల సందడి

### ఆటపాటలు, కోలాటంతో అలరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఉపాధ్యాయులు వెల్లంకి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు ఆటపాటలు, కోలాటంతో సందడిగా సాగాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో పాఠశాల ఆవరణ పండుగ శోభను సంతరించుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లులు కలిసి బతుకమ్మ ఆటలు ఆడుతూ, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. బతుకమ్మ పాటలు, కోలాటం ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది. అందరూ కలిసిమెలిసి వేడుకల్లో పాల్గొనడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడంతోపాటు, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెల్లంకి నాగరాజు, ఉపాధ్యాయులు రామారావు, రవిసంతోషం, కవిత, లక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ఉపాధి హామీ పనులు ప్రారంభించాలి.

## ఎంపీడీవో కార్యాలయంలోవినతిపత్రంఅందజేసిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు.

**పాలేరు ఆర్.సీ అక్టోబర్09 ప్రజా జ్యోతి** కూసు మంచి మండలంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వెంటనే మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధిహామీ పనులను ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తోటకూరి రాజశేఖర్, చిట్టూరి వెంకన్న డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శు క్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో హనుమంతరావు కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ సాధారణ వర్షపాతం కన్నా 50% తక్కువగా వర్షం కురిసిందని,సుమారు 3 నెలలుగా పంటలు లేక, వ్యవసాయ కార్మికులకు పనిలేక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మండలం నుండి వ్యవసాయ కూలీలు వివిధ మండలాలకు కూలీల కోసం వలసలు పోతున్నారు. వ్యవసాయ



కార్మికులు తీవ్రమైన హార్దిక్ ఇబ్బందుల్లో ఉన్నారని ఇలాంటి పరిస్థితులలో వెంటనే ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులను ప్రారంభించి వ్యవసాయ కార్మికులకు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వి. బి. జి. రాంజీ బిల్లును రద్దుచేసి గతంలో కొనసాగించిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి గ్రామాలలో పనులను వెంటనే ప్రారంభించాలని,ఉపాధి హామీ పనులను అదనంగా రెండు లక్షల కోట్లు కేటాయించాలని, ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులు కల్పించాలని, రెండు పూటల ఫోటో పద్ధతి రద్దు చేయాలని, కొలతల విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాలను దెబ్బ చేసే వి. బి. జి. రాంజీ బిల్లును రద్దుచేసి పాత పద్ధతి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టని అమలు చేయాలని,. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి నెలకు రూ.26,000 జీతం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని,రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నిత్యవసర వస్తువులు 14 రకాలు అందజేయాలని,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులందరికీ సంవత్సరానికి రూ. 12 వేల రూపాయలు అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు మున్సిపల్ ,పట్టణ, పేదలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కట్టాలని. అన్ని రకాల ప్రమాదాలకు భీమ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ అధ్యక్షులు బిక్కసాని గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు శీలం గురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కందుల బాబు, మండల కమిటీ సభ్యులు జవ్వాజి శీను, చీర్ల రామకృష్ణ, కర్ణ బాబు, కస్తాల వీరబాబు, రైతు సంఘం నాయకులు వెన్ను ఉపేందర్, చిట్టూరి మహేష్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం ,సమస్యల పరిష్కారమే లక్ష్యం.

## ఏ.ఎం.సి చైర్మన్ దోమ ఆనంద్ బాబు

**సత్తుపల్లి అక్టోబర్09(ప్రజా జ్యోతి) :** ప్రజల సంక్షేమం సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 90 రోజులకు నిర్వహించే మండల సమీక్ష సమావేశాలను45 రోజులకు నిర్వహించాలని, ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు అన్నారు. ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హాజరై అనంతరం ఆయన మాట్లాడుతూ,ప్రజా సమస్యలు ప్రజాప్రతినిధుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకు వచ్చి త్వరగా పరిష్కారం అయ్యే విధంగా పనిచేయాలని, సంకల్పంతో సమావేశాల కాల వ్యవధిని తగ్గించామని తెలిపారు. ఎంపీడీవో చిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్ ని నో కారణంగా భూగర్భ జలాలు తగ్గాయని మరి కొంతకాలం ఈ పరిస్థితి కొనసాగు అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం , ప్రజలు సర్పంచులు అప్రమత్తంగా వ్యవహరించి నీటి ని వృధా కాకుండా , పొదుపుగా వాడుకొని, గ్రామంలో ఎక్కడైనా పైపు లీకేజీలు ఉంటే వెంటనే చర్యలు తీసుకొని అరికట్టాలని





సూచించారు. పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సమావేశంలో వెల్లడించారు. పలువురు సర్పంచులు విద్యుత్ శాఖ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరమ్మ గృహాలు నిర్మాణ పూర్తయినప్పటికీ మీటర్లు అమర్చి, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కొత్త స్తంభాలు అవసరమైన చోట ఏర్పాటు చేసి,విద్యుత్ సౌకర్యం అందించడంలో అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని , అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఇటీవల సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ నగర్లో నివాసం ఉంటున్న గృహానికి విద్యుత్ స్తంభం నుంచి వచ్చే కరెంట్ ఆగిపోవడంతో బాధితులు సంబంధిత లైన్ మాన్ కి పలుమార్లు విజ్ఞప్తి చేసినా వాళ్లతో లేకపోవడం, కరెంట్ ఆఫీస్ లోని కంప్లైంట్ బుక్ లో రాసి వచ్చినప్పటికీ 3 రోజులు చీకటిలో గడిపినప్పటికీ విద్యుత్ శాఖ వారు కరుణించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు చరవాణి ద్వారా సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి కి సమస్యను వివరించాక ఎమ్మెల్యే సంబంధిత శాఖ బాధ్యులను ఆదేశించిన తర్వాత వెంటనే అధికారులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ నక్కా రాజేశ్వరరావు, ఎం.పి.ఓ జోత్స్నా దేవి, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రావణి, గంగారం పిహెచ్సి వైద్యులు డాక్టర్ అవినాష్ , వెటర్నరీ డాక్టర్ శశిధర్, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ సింధు, మిషన్ భగీరథ ఏ.ఈ జస్వంత్, విద్యుత్ శాఖ ఏఈ శరత్, సబ్ ఇంజనీర్ కిరణ్, ఇరిగేషన్ ఏ.ఈ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఏ.ఈ రమేష్, ఐసిడిఎస్ సిడిపిఓ సత్యావతి సర్పంచులు దొడ్డ రాజేంద్రప్రసాద్ , రోజా లక్ష్మి, పొదిలి మారేశ్వర రావు, ఓట్ల బాబురావు, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సీఐను మర్యాదపూర్వకంగా కలిసిన మండల ఫోటో, వీడియో గ్రాఫర్లు



**రఘునాథపాలెం, ప్రజా జ్యోతి** మండల పోలీస్ స్టేషన్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్‌ను మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సంగమయ్య, ప్రధాన కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి కెలావత్ రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు భూక్యా బాలజీ, గౌరవ అధ్యక్షులు జూకంటి భద్రాచారి, ఆడెపు హనుమంతరావు, ఫోటోగ్రఫీ కుటుంబ భరోసా ఇన్‌చార్జి జగదీష్, ఉపాధ్యక్షుడు మాలోత్ రమేష్, కార్యవర్గ సభ్యుడు బోడ రాంకీ, సీనియర్ జర్నలిస్టు భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యంతో చదవండి భవిష్యత్తుకు బాటలు వేసుకోండి...

**ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి**

**ఘనంగా బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు**




**సత్తుపల్లి అక్టోబర్09(ప్రజా జ్యోతి)** పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు ఇంటర్ మొదటి సంవత్సరం లో చేరిన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు గ్రాండ్ గా స్వాగతం పలకడం జరిగింది, ఈ కార్యక్రమన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ బి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మీ తల్లి తండ్రులు ఎన్నో ఆశలతో ఇంటర్ లో చేర్పించడం జరిగింది, వారి ఆశలను వమ్ము చేయకుండా,సక్రమంగా కళాశాలకు వచ్చి మంచిగా చదువుకొని, ప్రతి ఒక్కరు ఉన్నత స్థితిలో ఉండాలని కోరారు, అలాగే ఇంటర్ స్టేజి అనేది అటు ఇటు తెలియని వయసు చెడుకు, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా,మంచి మార్గంలో నడవాలని, మీ తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు, ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ యం. జానికి హాజరై అనంతరం ఆమె మాట్లాడుతూ ,విద్యార్థులు నేటి సమాజానికి నవ నిర్మాతలు కావాలని, మీ భవిష్యత్తు మీరే పునాదులు వేసుకొని, భావి భారత పౌరులు కావాలని కోరారు,ఈకార్యక్రమం లో ప్రిన్సిపాల్ లలితమ్మ, ప్రమీల, వనజరాణి, కల్పన, సత్యనారాయణ, కృష్ణవేణి, రాణి, శిరోమణి, రామారావు, సమ్మక్క, శ్వేత, వెంకటేశ్వరావు, సౌజన్య, సీత, వెంకటేష్ పాల్గొన్నారు,

# న్యూఢిల్లీ 12వ జాతీయస్థాయి సైన్స్ పాజెక్టు పదర్శన పోటీలకు ఎంపికైన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థిని సి.హెచ్.అన్విత

**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) అక్టోబర్: 9** ఖమ్మం జిల్లా నుండి ఫుట్ ప్రెస్ నెమాటిక్ లిఫ్టర్ జాక్ ప్రాజెక్టుతో జాతీయ స్థాయికి ఎంపికైన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ పాజెక్ట్ స్థానిక శ్రీనగర్‌కాలనీలోని స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థిని సి. హెచ్. అన్విత ఖమ్మంజిల్లా నుండి జాతీయస్థాయి పదర్శన మరియు పాజెక్టు పోటీలకు ఎంపికై జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చింది. సామాజిక సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానంతో ఫుట్ ప్రెస్ నెమాటిక్ లిఫ్టర్ జాక్ ఆవిష్కరణకు కృషిచేసిన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు. మాట్లాడుతూ, ఇన్‌స్పైర్ మానక్‌లో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచి, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ చీఫ్ వరంగల్, చీ×ఫ్ ఇన్‌స్పైర్ మానక్ వారి నుండి అవార్డు పొంది నేడు న్యూఢిల్లీలో నిర్వహించబోతున్న 12వ జాతీయ స్థాయి సైన్స్ పాజెక్టు పోటీలకు ఖమ్మం జిల్లా నుండి ఒకే ఒక్క ప్రాజెక్టుగా స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల సంతోషంగా ఉందంటూ విద్యార్థినిని సి. హెచ్. అన్వితను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. విద్య సామాజిక సమస్యల పరిష్కారానికి ఉపయోగపడినప్పుడే దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని తెలియజేస్తూ దానికనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక, నాణ్యమైన విద్యను అందిస్తూ ఆవిష్కరణల కు ముఖద్వారంగా స్టెమ్‌స్పార్క్




రెజొనెన్స్ స్కూల్ ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కొండా కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు అనుభవపూర్వక, కృత్యాధార బోధన చేస్తూ ప్రయోగాత్మకంగా నిరూపించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం వల్లనే జాతీయస్థాయికి ఎంపిక కాగలిగామంటూ విద్యార్థినిని, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక బతుకమ్మ.

**కారేపల్లి, అక్టోబర్ 09, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను విద్యార్థులు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, బ్రిలియంట్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణమంతా పూల సోయగాలతో పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్ ఓ జి. ఝాన్సీ సౌజన్య,బ్రిలియంట్ పాఠశాల కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు



మాట్లాడుతూ, దేవుణ్ణి పూలతో పూజిస్తాం.. కానీ, ఆ పూలనే దేవతా స్వరూపంగా భావించి పూజించే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ. పూలకు ప్రకృతికి, మహిళలకు విశిష్ట స్థానం కల్పించే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక. భారతదేశంలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేకత తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం. ఇది మన రాష్ట్ర గొప్పతనం, మన సంస్కృతి వైభవం అని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. నేటి తరం పిల్లలు మన పండుగల విశిష్టతను తెలుసుకొని, వాటి ప్రాముఖ్యతను, మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించా లని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# కూలీలకు ఉపాధీ పనులు కల్పించాలి.

## ఎంపీడీవోకు వ్యకాస వినతి.

**కారేపల్లి, అక్టోబర్ 09, ప్రజా జ్యోతి :** వ్యవసాయ కూలీలకు ఉపాధీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెంట్ ఎం.రమేష్ కు వినతిపత్రం అందజేశారు. ఎలినినో ప్రభావంతో గ్రామాలలో రైతులు పంటలు వేయక వ్యవసాయపనులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు వారికి వీబీజీ రాంజీ క్రింద పనులుకల్పించాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వ్యవసాయ సాగుతో జనవరి వరకు వ్యవసాయ పనులు దొరికే పరిస్థితి లేదు. కరువు పరిస్థితులతో వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలస పోతున్నారని అక్కడ కూడా పనులు లేక రోడ్ల వెంట తిరగాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని 200 రోజులు రూ. 700 కూలితో కల్పించాలని కోరారు. ఉపాధీ పనిలో కొలతలు, రెండు పూటల పోటోలుతీయటం వంటి నిబంధనలు ఇబ్బందికరంగా మారాయన్నారు. వీబీజీ రాంజీ బిల్లుతో కూలీలు పని హక్కు కోల్పోతారన్నారు.దానిని రద్దు చేయాలని డిమాండ్



చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలోభాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా క్రింద ప్రతి కూలికి ఏడాదికి రూ.12వేలు అందించాలని రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసరవస్తువులు పేదలకు అందజేయాలనికోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్షులు కేసగాని ఉపేందర్, నాయకులు చల్లా మల్లమ్మ, సీఐటీయు నాయకులు శనగ రాంబాబు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు.

## కారేపల్లిలో ఘనంగా చేగువేరా వర్ధంతి.

కారేపల్లి, అక్టోబర్ 09, ప్రజా జ్యోతి : ప్రపంచ దేశాలపై పెత్తనం కోసం అమెరికా ఆరాట పడుతుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,సింగరేణి మండల కార్యదర్శి కే.నరేంద్రలు విమర్శించారు. ప్రపంచ విప్లవకారుడు, యూత్ ఐకాన్, చేగువేరా 59వ వర్ధంతిని సిపిఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యూబాలో విప్లవం సాధించడంలోనూ అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని అంతర్జాతీయ వేదికలపై ఎండ కట్టడంలో కీలక భూమిక పోషించి నిజమైన ప్రపంచ విప్లవకారుడుగా చేగువేరా నిలిచారని కొనియాడారు. వనరులను దోచుకోవడం కోసమే ట్రంప్ పశ్చిమ ఆసియా దేశాలపై యుద్ధం చేస్తున్నాడన్నారు. గుత్తాధిపత్యం ఎంతటి ప్రమాదాన్ని కల్గిస్తుందో ప్రపంచ దేశాలపై అమెరిరావిధిస్తున్న సుంకాలు, నిర్భంధాలు తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఈ ప్రమాదాన్ని చేగువేరా చాలా ఎండ్ల క్రిందటే గుర్తించి ప్రపంచ దేశాలను హెచ్చరించటంతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటానికై తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అమెరికా పక్కలో బల్లెంలా ఉన్న చేగువేరా ను



బొలివియాలో అమెరికా హత్య చేసిందని విమర్శించారు. చేగువేరా మార్గదర్శకంగా, స్ఫూర్తితో నేటి యువత పోరాడుతున్నారన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్, చల్లా మల్లమ్మ, గజ్జల శ్రీను, శనగ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ సెక్షన్లు పరిశీలన

**పరిశీలించిన ఖమ్మం ఎస్ ఈ శ్రీనివాస చారి, బండి శ్రీనివాసరావు**



**బోనకల్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని బోనకల్, కలకోట సోలార్ సెక్షన్ లను జిల్లా ఎస్ ఈ శ్రీనివాస చారి , మధిర విద్యుత్ శాఖ అధికారి బండి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించి సోలార్ పనులను పర్యవేక్షించారు. అనంతరం బోనకల్ సెక్షన్ కార్యాలయంలో సబ్-ఇంజనీర్లందరితో కలిసి సోలార్ మౌలిక సదుపాయాలు మరియు నెట్ మీటర్ల బిగింపు పనులను సమీక్షించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి దృష్ట్యా, బోనకల్ సెక్షన్ పరిధిలోని రావినూతల సబ్-స్టేషన్ లో 2 ఇ 8 ఎం వి ఏ పి టి ఆర్ లను విజయవంతంగా ఛార్జ్ చేశారు. అదేవిధంగా కలకోట సెక్షన్ పరిధిలో గల పెదబీరవల్లి గ్రామంలోని 7.5 కె డబ్ల్యు వ్యవసాయ సోలార్ ప్లాంట్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బోనకల్ ఏ డి ఈ వై వి ఆనంద్ కుమార్ , బోనకల్ విద్యుత్ శాఖ ఏఈ తోకల మనోహార్, కలకోట విద్యుత్ శాఖ ఏఈ మోహన్, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## అసంపూర్తి పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేయండి

**విద్యార్థుల భవిష్యత్ కాపాడండి**

**టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి**



**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 09 ప్రజా జ్యోతి** ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి డి.వాసంతి ని టి డబ్ల్యు ఎంఎఫ్ జిల్లా ఇంచార్జ్ గుండ. ఉపేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది అనికూసుమంచి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ప్రాథమిక పాఠశాలలోఉన్న మూడు గదులలో, మొత్తం 124 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, ప్రీ ప్రైమరీ తరగతి విద్యార్థులకు ఒక గది కేటాయించ గా మిగిలిన రెండు గదులలో మాత్రమే విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు అని కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతి ని వివరించారు. వారు స్పందిస్తూ తక్షణమే కోఆర్డినేటర్ పాఠశాల సందర్శించి ,పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి..

**మృతురాలి భౌతికకాయానికి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నివాళులు..**





**ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి:** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డులో విషాదం చోటుచేసుకుంది. సిపిఐ కార్యకర్త చల్ల ఉపేందర్ భార్య చల్ల కవిత (26) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. చిన్న వయసులోనే ఆమె ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతురాలి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.మృతురాలు కవితకు భర్త ఉపేందర్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిని కోల్పోయిన ఇద్దరు చిన్నారులను చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# పర్యావరణ పరిరక్షణలో ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం ముందడుగు

## తిరుమలాయిపాలెం మండల రిజర్వ్ ఫారెస్ట్‌లో సీడ్ బాల్స్ విస్తరణ కార్యక్రమం విజయవంతం






**ఖమ్మం ప్రతినిధి: (ప్రజా జ్యోతి) అక్టోబర్: 9:** ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపు మేరకు లక్ష సీడ్ బాల్స్ తయారీ లక్ష్యంతో, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీతో పాటు వాటిని అటవీ ప్రాంతాల్లో విస్తరించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంపాక్ట్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షులు శ్రీ బొమ్మగాని నరసింహారావు ఆధ్వర్యంలో తయారు చేసిన సీడ్ బాల్స్‌ను ఖమ్మం జిల్లా తిరుమలాయిపాలెం మండలంలోని పులి గుట్ట రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో విస్తరించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జడ్ పీ హెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి విజయకుమారి పాఠశాల సైన్స్ టీచర్, సోషల్ టీచర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కూసుమంచి ఫారెస్ట్ రేంజ్ అధికారి పి. శ్రీనివాసరావు డీఆర్ఓ శ్రీ కె.వి. రామారావు నేలకొండపల్లి ఎఫ్ఎస్ఓ డేనియల్ ఎఫ్‌బీఓ ఎ. వెంకటేశ్వర్లు మరియు అటవీ శాఖ సిబ్బంది సహకరించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ, జీవవైవిధ్య పరిరక్షణలో సీడ్ బాల్స్ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం ద్వారా పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు కృషి చేశారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ నిర్దేశించిన లక్ష సీడ్ బాల్స్ తయారీ లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు, తయారు చేసిన సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతాల్లో విస్తరించే కార్యక్రమాలను కూడా వేగవంతంగా నిర్వహిస్తున్న ఇండియన్ కామన్ ఫార్మర్స్ క్లబ్ ఖమ్మం అధ్యక్షులు శ్రీ బొమ్మగాని నరసింహారావు క్లబ్ సభ్యులందరికీ ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజన్-3 ప్రాంతీయ అధ్యక్షులు మహమ్మద్ నవాబ్ పాషా ప్రత్యేక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు. ప్రకృతిని కాపాడటం, పచ్చదనాన్ని పెంపొందించడం, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## భక్తి పారవశ్యంలో ఖమ్మం నగరం అక్టోబరు 11 నుంచి 20 వరకు

# మహోత్సవాల ఘట్టం





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోతోంది. చారిత్రాత్మక స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి (గుట్ట) ఆలయ ఆధ్వర్యంలో జమ్మిబండ పుణ్యవేదికగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఆధ్యాత్మిక వైభవంతో జరగనున్నాయి. దేవాదాయ శాఖ ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఆలయ అభివృద్ధి కమిటీ మరియు స్వామివారి భక్త బృందం సంయుక్త కలయికతో పది రోజుల పాటు ఈ దివ్య సమరం సాగనుంది.

**రోజుకో అలంకారం నిత్యం దివ్యార్చనలు**

అక్టోబరు 11 నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో భవానీ మాత రోజుకో శక్త్యవతారంలో భక్తులకు దర్శనమివ్వనుంది.

**ప్రత్యేక ఆరాధనలు:** ఉదయం, సాయంత్రం వేళల్లో మహా మంత్ర పఠనాలు, కుంకుమార్చనలు,మహాహారతులతో జమ్మిబండ ప్రాంగణం దేవీ దివ్య తేజస్సుతో మార్మోగనుంది.

**భక్తుల తీర్థం:** జగన్మాత దివ్యాకృతులను దర్శించుకుని తారక నామ స్మరణలో మునిగితేలేలా విస్తృత ఏర్పాట్లు సాగుతున్నాయి.

**అక్టోబరు 17: అన్నపూర్ణాదేవి అలంకరణ - అన్నప్రసాద వితరణ**

ఉత్సవాల్లో అత్యంత మహిమాన్వితమైన ఘట్టం అక్టోబరు 17న ఆవిష్కృతమకానుంది.?సకల లోక రాత్రిణి ఆ రోజు అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు అభయాభయం ప్రసాదించనున్నారు.

**మహా ప్రసాదం:** మధ్యాహ్నం 12:30 గంటలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు భక్తిశ్రద్ధలతో విశేష అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నారు.

**విజయదశమి వేళ శమీపూజ - గుట్ట నుంచి జమ్మిబండకు స్వామివారి విజయయాత్ర!**

ఉత్సవాల చివరి ఘట్టమైన విజయదశమి అక్టోబరు 20 న ఖమ్మం పురవీధులు నరసింహ నామస్మరణతో ప్రకంపించనున్నాయి.

# జూనియర్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ లింగమనేని నళిని శ్రీ



**బోనకల్, అక్టోబర్ 9(ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లింగంలేని నళిని శ్రీ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలలో బతుకమ్మ పండుగ పెద్దదని భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో ఆచరించాలని తెలియజేశారు. బతుకమ్మ సంబరాలను ప్రిన్సిపాల్ లింగంలేని నళిని శ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అలరించారు. వీరితోపాటు అధ్యాపకులు అందరూ కూడా బతుకమ్మ సంబరాలలో పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సమిష్టి కృషితోనే సంచికి రూ.22 చెల్లించాం

**లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రం**

**మొక్కజొన్న సంచుల చెల్లింపుల్లో పారదర్శకత**

**సహకరించిన మంత్రులకు ధన్యవాదాలు**

**30 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో నేరుగా జమ పట్ల హర్షం**



**బోనకల్, అక్టోబర్ 9(ప్రజా జ్యోతి):** రైతులందరి సహకారం, సమిష్టి బాధ్యతతోనే సహకార సంఘాన్ని పరిరక్షించి మరింత బలోపేతం చేయడం సాధ్యమవుతుందని లక్ష్మీపురం సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు అన్నారు. సహకార సంఘం అనేది ఏ ఒక్క వ్యక్తికో, ఒక వర్గానికో చెందిన వ్యవస్థ కాదని, సభ్యులైన రైతులందరి ఉమ్మడి ఆస్తి అని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు అందించడంతో పాటు వారి ఆర్థిక ప్రయోజనాలను కాపాడటంలో సొసైటీ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కొంతమంది రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించకపోవడం వల్ల సొసైటీ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం పడటమే కాకుండా, మిగతా రైతులు కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి రైతు బాధ్యతగా వ్యవహరించి పెండింగ్ బకాయిలను చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.రైతులకు న్యాయం జరగాలనే లక్ష్యంతో మొక్కజొన్న సంచుల కొనుగోలు వ్యవహారంలో ఒక్కో సంచికి ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.22 చొప్పున చెల్లింపులు అందేలా సొసైటీ తరఫున పట్టుదలతో కృషి చేసినట్లు చైర్మన్ మాదినేని వీరభద్రరావు వివరించారు. కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించే సమయంలో ఒక్కో సంచికి రూ.22 చెల్లిస్తామని ప్రభుత్వం తెలిపిన నేపథ్యంలో, ఆ మేరకు లిఖితపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలని సంబంధిత అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. అయితే వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులు సూచించడంతో, ప్రభుత్వ హామీపై విశ్వాసంతో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందడుగు వేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో సుమారు రూ.50 లక్షల విలువైన సామగ్రికి సంబంధించి దాదాపు 2.30 లక్షల సంచులను కొనుగోలు చేసి ప్రభుత్వానికి సరఫరా చేసినట్లు వెల్లడించారు. అనంతరం ఒక్కో సంచికి రూ.15 లేదా రూ.20 మాత్రమే చెల్లింపులు వస్తాయంటూ కొన్ని ప్రచారాలు జరిగాయని, కోర్టు వ్యవహారాల కారణంగా డబ్బులు రావనే వదంతులు కూడా వ్యాపించాయని తెలిపారు. అయితే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కో సంచికి రూ.22 చొప్పున చెల్లింపులు అందించాలన్నదే సొసైటీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు సంబంధిత అధికారులతో సంప్రదింపులు కొనసాగించినట్లు చెప్పారు. మొక్కజొన్న సంచులకు సంబంధించిన చెల్లింపులు సొసైటీ వద్ద నిలిచిపోకుండా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకునే అంశాన్ని కూడా పరిశీలించినట్లు చైర్మన్ తెలిపారు.సుమారు 1,600 మంది రైతులకు సంబంధించిన చెల్లింపుల వివరాలు అందాయని, దాదాపు 2.50 లక్షల సంచులకు సంబంధించి రావాల్సిన మొత్తాలు పూర్తిగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.తనకు తెలిసినంత వరకు ఇప్పటివరకు చెల్లింపుల విషయంలో పెద్దగా ఫిర్యాదులు అందలేదని, మిగిలిన మొత్తాలు కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల్లో సంచికి రూ.15 లేదా రూ.20 మాత్రమే చెల్లిస్తున్నారనే సమాచారం వినిపిస్తున్న నేపథ్యంలో, తమ సొసైటీ పరిధిలో రైతులకు రూ.22 చొప్పున చెల్లింపులు అందేలా చేసిన ప్రయత్నాలను ప్రజలకు తెలియజేయాలని పత్రికా ప్రతినిధులను కోరారు. రైతుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు, మంత్రులు సహకరించడం అభినందనీయమని మాదినేని వీరభద్రరావు అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతుల ప్రయోజనాల కోసం కృషి చేయడం, ఆర్థిక శాఖకు సంబంధించిన సహకారం, స్థానిక ప్రజాప్రతినిధుల తోడ్పాటు ఈ ప్రక్రియలో ఉపయోగపడినట్లు వివరించారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం చెల్లింపులు అందేలా సహకరించిన ప్రభుత్వానికి, మంత్రులకు, అధికారులకు సొసైటీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.రైతుల సంక్షేమం విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రైతులకు, ప్రజలకు ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు.

# బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్వే తీరుపై రోడ్డుపై ఆందోళన

**అధికారులు సర్వే తప్పులుగా చేస్తున్నారనీ ఆరోపణ**

**అధికారుల స్పందించారని గ్రామస్తుల డిమాండ్**

**సర్వేలో వాస్తవాలు వెల్లడించాలి**

**కోరుతున్న బ్రాహ్మణపల్లి గ్రామస్తులు**



**బోనకల్, అక్టోబర్ 9 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న తీరుపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ రోడ్డుపై కూర్చొని ఆందోళన చేపట్టారు. సర్వే సక్రమంగా నిర్వహించడం లేదని, తప్పులుగా సర్వే చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వే విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వే నిర్వహించే సమయంలో సంబంధిత భూములు, హద్దులు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. సర్వేలో ఏవైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్ది, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**సర్వే అధికారులపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి...**

బ్రాహ్మణపల్లి గ్రామంలో సర్వే తీరుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్వే ప్రక్రియపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సర్వేలో తప్పులు జరిగాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నప్పటికీ, అధికారుల వివరణ, విచారణ వివరాలు అందుబాటులో లేవు. విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడికావాల్సి ఉందనీ గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# వైభవోపేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామి
# ఆలయ నిర్మాణ భూమిపూజ
# నిర్వహించాలి



- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకార చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- తిరుమల తరహాలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- తిరుమల తరహాలో క్యూలైన్లు, బారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి
- భక్తులకు అన్నప్రసాదం, త్రాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచాలి
- అక్టోబర్ 12న అల్లిపురంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా ఆలయ భూమిపూజ
- ఆలయ నిర్మాణ ప్రాంగణాన్ని, భూమిపూజ ఏర్పాట్లను పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి**

ఖమ్మం నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి మంత్రి భూమిపూజ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించి నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ సోమవారం అల్లిపురంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు.దేవదేవుని ఆశీస్సులతో ఖమ్మం నగరంలో స్వామివారి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమని తెలిపారు. ఆలయ నిర్మాణం, నిర్వహణ బాధ్యత పూర్తిగా తిరుమల తిరుపతి దేవస్థానానిదేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు ఖమ్మం నగరంలోనూ టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు.భక్తిభావం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేయాలి.ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించాలని మంత్రి సూచించారు. పూజా కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను విస్తృతంగా చేపట్టాలని, ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా చూడాలని ఆదేశించారు.పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, దేవాదాయ తదితర శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని, అవసరమైన కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి శాఖకు నిర్దిష్టబాధ్యతలు అప్పగించాలని తెలిపారు. అధికారులు అంకితభావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.తిరుమల తరహాలో క్యూలైన్లు, బారికేడ్లు,తిరుమలలో అనుసరించే విధానాలను ఆదర్శంగా తీసుకుని భక్తుల రాకపోకలకు అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి పూజ ప్రాంగణం, భోజన కేంద్రాలు, ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎక్కడా తొక్కిసలాటకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.అన్నప్రసాదం, పులిహోర సమృద్ధిగా అందించాలి.భూమిపూజ కార్యక్రమానికి ఎంతమంది భక్తులు వచ్చినా అందరికీ నాణ్యమైన భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి తెలిపారు. భూమిపూజ జరిగే ప్రాంతానికి దూరంగా భోజన కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎక్కువ సంఖ్యలో ఆహార పంపిణీ కౌంటర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ప్రసాద పంపిణీ కేంద్రాలను పెంచాలని, ప్రసాదం కోసం వచ్చే భక్తులకు క్రమబద్ధమైన క్యూలైన్లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎక్కువ సంఖ్యలో త్రాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు మజ్జిగ ప్యాకెట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు.పార్కింగ్, వైద్య, విద్యుత్ సదుపాయాలు కల్పించాలి.భక్తులు నాలుగు వైపుల నుంచి వచ్చే మార్గాలకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలను గుర్తించాలని మంత్రి సూచించారు. పార్కింగ్ ప్రాంతాలు, వాహనాల రాకపోకల మార్గాలు, భక్తులు ప్రాంగణానికి చేరుకునే దారులకు సంబంధించిన వివరాలను మ్యాప్‌తో సహా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ వివరాలను పోలీస్ శాఖ ద్వారా పాత్రికేయులకు అందించి, భక్తులకు ముందుగానే సమాచారం చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.పుష్కరాల తరహాలో వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది,అవసరమైన వైద్య సదుపాయాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రాంగణంలో నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, అవసరమైన సిబ్బంది, యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమా నికి వచ్చే పాత్రికేయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు.పార్టీలకతీతంగా భక్తులందరూ పాల్గొనాలి. ఖమ్మం నగరంలో ప్రజల సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని,అవసరమైన ప్రాంతాల్లో ప్రజలను ఒప్పించి రహదారుల



విస్తరణ పనులు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు.తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో ఆలయం నిర్మించడం ఈ ప్రాంత ప్రజలకు దేవదేవుడు అందించే గొప్ప ఆశీర్వాదమని పేర్కొన్నారు. తిరుమలలో పాటించే క్రమశిక్షణ, భక్తిభావం, నిర్వహణ విధానాలు ఖమ్మం ఆలయంలోనూ అమలవుతాయని తెలిపారు.పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఆలయ భూమి పూజ కార్యక్రమానికి హాజరై దేవదేవుని ఆశీస్సులు పొందాలని మంత్రి కోరారు. కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో విజయవంతం చేసేందుకు భక్తులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం నిర్మాణం జరగడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణంపై ప్రజలు ఎంతో ఆసక్తి, భక్తిశ్రద్ధలు కనబరుస్తున్నారని పేర్కొన్నారు. భూమిపూజకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేపడతామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీటీడీకి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల భద్రత, సౌకర్యాల కోసం పోలీస్ శాఖ తరఫున సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు.వాహనాల పార్కింగ్, భక్తుల రాకపోకలు, భోజన కేంద్రాలు, ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణతో పాటు కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూలి భూమిపూజ కార్యక్రమం సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాంగంతో చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, టిటిడి దేవస్థానం, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ బాబు రత్నాకర్

# 60వ జన్మదిన వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** అంకితభావం, మానవత్వం, నిరంతర ప్రజాసేవకు నిలువెత్తు నిదర్శనంగా, నిరుపేదలు,బడుగు బలహీన వర్గాల గుండెల్లో ఆశాజ్యోతిగా వెలుగుతున్న ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు, ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ పీడియాట్రిక్ ప్రొఫెసర్, డాక్టర్ బాబు రత్నాకర్ 60వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలు ఖమ్మంలో అత్యంత వైభవంగా, పండగ వాతావరణంలో జరిగాయి.

### వైద్యం కేవలం వృత్తి కాదు... ఒక దివ్యమైన సేవ

వైద్య వృత్తిని కేవలం సంపాదన మార్గంగా కాకుండా, పేద ప్రజలకు సేవ చేసే ఒక దివ్యమైన అవకాశంగా మలచుకున్న డాక్టర్ బాబు రత్నాకర్ 60వ జన్మదిన వేడుకలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, వైద్య నిపుణులు, సామాజిక వేత్తలు, ఆసుపత్రి సిబ్బంది, రోగుల కుటుంబాలు, శ్రేయోభిలాషులు ఆయనను నేరుగా కలిసి శాలువాలు,పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా గత కొన్ని దశాబ్దాలుగా విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ రత్నాకర్, “డాక్టర్ రాజకుమారి తల్లి పిల్లల వైద్యశాల” తన చెల్లెలు పేరుతో 2003లో ఖమ్మంలో స్థాపించి వేలాది మంది పేద, మధ్యతరగతి చిన్నారులకు నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారు.నవజాత శిశువుల నుంచి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడే పిల్లల వరకు ఆయన అందించిన వైద్యం ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపింది.డబ్బుల్లేవనే కారణంతో ఏ ఒక్కరినీ వెనక్కి పంపని గొప్ప మనసు ఆయన సొంతం. వైద్య సేవలతో పాటు ఆసుపత్రి ద్వారా అనేకమంది స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే కాకుండా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యా సహాయం, పాండమిక్ విపత్తుల సమయంలో ఉచిత వైద్యం,నిత్యావసరాల పంపిణీ చేసి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు.

### క్రమశిక్షణ, సేవానిరతికి ప్రతీక జీవిత విశేషాలు:

1966 అక్టోబర్ 9న కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన డాక్టర్ బాబు రత్నాకర్ విద్యావంతులైన కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు. తల్లిదండ్రులు:
తండ్రి ఆదామ్ బాబు ఎం ఎ , బి .ఇడి , రిటైర్డ్ హెడ్మాస్టర్ , తల్లి బుంగ మేరీ భూషణం హెడ్మాస్టర్ .

**విద్యాభ్యాసం:** ప్రాథమిక విద్యను తల్లి వద్దనే కల్లూరు ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేసి, 6 నుండి 10వ తరగతి వీఎం బంజర హైస్కూల్‌లో చదివి మండల్ టాపర్‌గా నిలిచారు.విజయవాడ లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాక,ప్రసిద్ధ నిలోఫర్ (హైదరాబాద్) లో ఎం డి,డి సి హెచ్ పూర్తి చేశారు.

**కుటుంబ వివరాలు:** కుటుంబంలో నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు,సోదరులు లండన్, జపాన్,హైదరాబాద్‌లలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడగా, మొదటి సోదరి కొత్తగూడెంలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఎమ్.ఎస్సీ మ్యాథ్స్ పూర్తి చేసి మరణించిన రెండవ సోదరి కుమార్తె రాజకుమారి, ఖమ్మంలో 23 ఏళ్ల క్రితం “స్మార్ట్ అనే సేవా సంస్థను ప్రారంభించి నిరుపేదలకు,తల్లిలేని పిల్లలకు సేవలు అందించారు.

**వారసత్వాన్ని కొనసాగిస్తున్న సంతానం:** తల్లి మేరీ భూషణం, మేనమామ ఒగిరాల దావీదు కోరిక మేరకు తాను డాక్టరై ఇద్దరి పిల్లలను డాక్టర్లుగా తీర్చిదిద్దారు.నేను చదివిన ఉస్మానియా మెడికల్ కాలేజీలోనే మా పిల్లలని చదివించడం విశేషం.కుమారుడు డాక్టర్ బుంగ రాజా భూషణ్ చెన్నైలో ఎం ఎస్ (ఆర్థోపెడిక్) చేస్తుండగా, కుమార్తె డాక్టర్ బుంగ హర్షిత పీజీ ప్రిపరేషన్‌లో ఉన్నారు.









బుంగ

### నా ఊపిరి ఉన్నంతవరకు సేవే లక్ష్యం: డాక్టర్ రత్నాకర్

ఖమ్మంలో మా చెల్లెలు పేరుమీద స్థాపించిన 2003 లో రాజకుమారి తల్లి పిల్లల వైద్యశాలలో నేను నా భార్య స్వర్ణకుమారి స్త్రీల ప్రత్యేక వైద్య నిపుణురాలు గైనకాలజిస్ట్, పేదలకు సేవలు అందిస్తున్నాం . తన 60వ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ డాక్టర్ బాబు రత్నాకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల దీవెనలు,చిన్నారుల చిరునవ్వులే నాకు అతిపెద్ద బహుమతి.నా ఊపిరి ఉన్నంతవరకు నిరుపేదలకు,బడుగు బలహీన వర్గాలకు వైద్య సేవలు అందిస్తూనే ఉంటాను అని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు.మానవ సేవే మాధవ సేవ” అనే సూక్తికి నిజమైన నిర్వచనంగా నిలిచిన డాక్టర్ బాబు రత్నాకర్ మరిన్ని ఏళ్ల పాటు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆసుపత్రి సిబ్బంది,అభిమానులు, ఖమ్మం ప్రజలు ఆకాంక్షించారు.

## ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

**వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తాహసిల్దార్ కు వినతి పత్రం అందజేసిన నాయకులు**



**బోనకల్ , అక్టోబర్ 9(ప్రజా జ్యోతి):** మండలం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బోనకల్ మండల తాహసిల్దార్ చల్లూరి సుధాకర్ కు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు . రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, గ్రామాలలో వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12000 పెన్షన్లు ఇవ్వాలని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద పెన్షన్లు ఇవ్వాలని, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కొత్తవారికి వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని, పెన్షన్ 2000 నుండి 4 వేలకు పెంపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బంధం రాజ్యం, వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు భద్రాచలం, ఉప్పర శ్రీను, బోయినపల్లి గురవయ్య, గద్దల సుందర్రావు, కొట్టే జయరాజ్ బోయినపల్లి గురవయ్య, ఇమ్మడి వెంకటేశ్వర్లు, పర్సగని లక్ష్మి, గద్దె భూషమ్మ, బొడ్డుపల్లి రమాదేవి, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సంఘపు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీ అకాడమీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల కేంద్రంలోని ఎస్ వి అకాడమీ లో ప్రిన్సిపాల్ తొండ సతీష్ కుమార్ అధ్యక్షతన తెలంగాణ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ చైర్మన్ మిరియాల శ్యాం ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతితో మమేకమైన ప్రత్యేకమైన పండుగ తెలంగాణ బతుకమ్మ ప్రకృతిలో భగవంతుడు సృష్టించిన పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా కొలుచుకోవడం తెలంగాణ సాంప్రదాయం ఆధునిక యుగంలో సనాతన ధర్మాన్ని పాటిస్తూ విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు తల్లిదండ్రులు భాగస్వామ్యములతో ఎంతో ఆహారకరంగా సమాజాన్ని చైతన్యపరిచే విధంగా అకాడమీ యాజమాన్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి అకాడమీ గౌరవ సలహాదారులు సామినేని గిరిధర్ ప్రిన్సిపాల్ సతీష్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# నగరంలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగరంలో ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.శుక్రవారం ఖమ్మం నగరంలోని 44వ డివిజన్ బాలాజీనగర్‌లో సుడా నిధులు రూ. 90 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో రోడ్ల విస్తరణ పనులను ప్రజలను ఒప్పిస్తూ,అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు అంగీకరించని చోట బలవంతంగా పనులు చేపట్టడం లేదని స్పష్టం చేశారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.నగరంలో చేపట్టే అభివృద్ధి పనులన్నీ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, అవి దీర్ఘకాలం మన్నికగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ప్రజలకు ఉపయోగపడే మౌళిక



సదుపాయాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా,మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల హక్కులకు భరోసా బాల్య వివాహాల నిర్మూలనకు పిలుపు

**అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా షీ టీం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్**





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్) సంస్థ మరియు పోలీస్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం నందు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన షీ టీం ఏ హెచ్ టి యు ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడపిల్ల అంటే కుటుంబానికి వెలుగు సమాజానికి బలం దేశ భవిష్యత్తుకు పునాది అని ఒక బాలికకు విద్యను అందిస్తే ఒక కుటుంబానికి వెలిగినట్లేనని అది దేశ అభివృద్ధికి బాటలు వేస్తుందని అన్నారు కానీ నేటికీ అనేక ప్రాంతాల్లో బాలికలు బాల్యవివాహాలు బాల కార్మికత్వం లింగ వివక్ష పోషకాహార లోపం, విద్యకు దూరం అవడం వంటి అనేకరమైన రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇవన్నీ అరికట్టడం మనందరి బాధ్యత అని అన్నారు. బాలికలపై లైంగిక దాడులు నానాటికి పెరుగుతున్నాయని అలాంటి మృగాల పట్ల ప్రమాదంగా ఉండి రాజుల ఎదగాలని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కోరారు. షీ టీం యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ద్వారా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాలికలకు మహిళలకు అవగాహన కల్పిస్తూ అండగా ఉంటున్నామని తెలిపారు సమస్య ఏదైనా ఉంటే వెంటనే పోలీస్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ నెంబర్ 112 కి డయల్ చేసి సహాయం పొందాలని కోరారు.

ౖటెడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా బాల్యవివాహాల నిర్మూలనకు గత నాలుగు సంవత్సరాలుగా జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు ఈ సంవత్సరం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాల్యవివాహాలను నిర్మూలించడం బాలికల హక్కుల రక్షణకు పెట్టుబడి పెట్టడం అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బాలికల హక్కుల పై పెట్టుబడి పెట్టడం అంటే వారి విద్య ఆరోగ్యం పోషకాహారం భద్రత నైపుణ్యాల మరియు సమాన అవకాశాలపై దృష్టి పెట్టడం అని అభిప్రాయాలకు విలువ ఇవ్వడం ద్వారా బాలికల ఆత్మీయ విశ్వాసంతో తమ భవిష్యత్తును నిర్మించుకోగలుగుతారని అన్నారు. అనంతరం బాలికలు ఉపాధ్యాయులు అతిథులు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది.అందరూ కలిసి బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలను వేడుకగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కె శ్రీనివాస్ ఎస్ టి యు బాధ్యులు భాస్కర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ లత షీ టీం కానిస్టేబుల్స్ రుక్మిణి కిరణ్ అధ్యాపకులు ఉపాధ్యాయులు , సభ్యులు రాందాస్ రవీంద్ర బాబు భాస్కర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే అత్యంత కీలకం

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే అత్యంత కీలకమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు గ్రామ పరిధిలో గల శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల అప్రమత్తతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తలు పాటించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని బ్యాంకు అధికారులమని ఫోన్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించడం, నకిలీ లింకులు పంపడం, ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు ఆశ చూపించడం, ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం వంటి పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. కొందరు వ్యక్తులు పోలీసులమని, ఇతర ప్రభుత్వ అధికారులమని చెప్పి భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తొందరపడి డబ్బులు పంపవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు సమాచారం, ఓటీపీ, యూపీఐ పిన్, పాస్‌వర్డ్‌లను ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను తెరవడం, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, ఇతరులకు ఫోన్ స్క్రీన్‌ను షేర్ చేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని, రెండు దశల ధృవీకరణ (టూ–ఫ్యాక్టర్ ఆథెంటికేషన్) సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల విద్యార్థులు తమకు తెలిసిన సైబర్ భద్రతా అంశాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన లేని కుటుంబ సభ్యులకు తగిన సూచనలు చేయాలని అన్నారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సదస్సులో సైబర్ సెక్యూరిటీ విభాగ ఏసీపీ ఫణీంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట చలపతి, ఖమ్మం రూరల్ కూసుమంచి, నెలకొండపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కళాశాల డీన్ డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

### జమలాపురం దేవస్థానంలో ఆదివారం నుండి ప్రారంభం కానున్న

## దేవి శరన్నవరాత్రోత్సవములకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### దేవస్థానం ఈవో కొత్తూరు జగన్మోహన రావు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ చిన్న తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రోత్సవములు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం ఈవో కొత్తూరు జగన్మోహన్రావు శుక్రవారం తెలియజేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవమునకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు హాజరుకానున్నట్లు తెలియజేశారు. 11- 10 - 2026 ఆదివారం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి 20 10 26 మంగళవారం వరకు విజయదశమి వరకు కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలియజేశారు. 11వ తేదీన ఆదివారము యాగశాల ప్రవేశం కలశ స్థాపన సాయంత్రం ఏడు గంటల నుండి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలతో ప్రారంభమై 12వ తేదీన నిత్య పూజలు మండపారాధనలు, గణపతి హోమము, 13వ తేదీన మంగళవారం శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద సామూహిక కుంకుమార్చన, 14వ తేదీన బుధవారం నిత్య పూజలు, అనుష్ఠానములు, 15వ తేదీన గురువారం నిత్య పూజలు అనుష్ఠానములు నవగ్రహ హోమం, 16వ తేదీన శుక్రవారం మూలా నక్షత్రం సరస్వతి దేవి పూజ లు అక్షరాభ్యాసములు , 17వ తేదీన శనివారం భక్తులచే సామూహిక చండీ హోమం ప్రారంభం, 18వ తేదీన ఆదివారం దుర్గాష్టమి నిత్య పూజలు నుష్ఠానములు సామూహిక చండి హోమం కొనసాగింపు, 19వ తేదీన సోమవారం సామూహిక చండీ హోమం పరిసమాప్తి పూర్ణాహుతి, 20వ తేదీన మంగళవారం విజయదశమి వేడుకలు మహా పూర్ణాహుతి చక్రస్నానం సాయంత్రం 5 గంటల నుండి సమీ పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ప్రతిరోజు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. భక్తులందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని శ్రీవారి దర్శించి శ్రీవారి సేవలో పాల్గొనాలని దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల విజయ్ దేవ శర్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ పేర్కొన్నారు.

### కందుకూరు -వెంకటాపురం రోడ్డులో ఘోర ప్రమాదం



**వేంసూరు అక్టోబర్ 9 ప్రజాజ్యోతి** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో కందుకూరు గ్రామానికి చెందిన మందపాటి సంతోష్ రెడ్డి మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే గురువారం అర్ధరాత్రి సమయంలో సంతోష్ రెడ్డి కారులో కందుకూరు నుంచి వెంకటాపురం వైపు వెళ్తుండగా, మార్గమధ్యలో కారు అదుపుతప్పింది. దీంతో రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టి, సమీపంలోని పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రతకు సంతోష్ రెడ్డి మృతి చెందారు. ఈ ఘటనతో కందుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, అతివేగానికి దూరంగా ఉంటూ రహదారి పరిస్థితులకు అనుగుణంగా వాహనాలు నడపాలని పోలీసులు సూచిస్తున్నారు.

## ప్రభుత్వం అందిస్తున్న పశువుల మందులను అమ్ముకుంటున్న డాక్టర్ పై చర్యలు తీసుకుంటాం

**జిల్లా పరిశ్రమ వద్దక జాయిన్ డైరెక్టర్ పురంధర్**



ఎర్రుపాలెం ప్రజా జ్యోతి మండల కేంద్రంలో పనిచేస్తున్న పశువుల డాక్టర్ శివకుమార్ ప్రభుత్వం నుండి వస్తున్న మందుల్ని రైతులకు అందించకుండా బయట అమ్ముకుంటున్న పశువుల డాక్టర్ శివకుమార్ పై వచ్చిన ఆరోపణలను విచారణ చేయడానికి వచ్చిన జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బోడేపుడి పురంధర్ కు ఎర్రుపాలెం రైతులు ఈ డాక్టర్ ను విధుల నుండి తప్పించి మరొక డాక్టర్ ను నియమించాలని పశువుల డాక్టర్ గా పనిచేస్తున్న శివకుమార్ పై ప్రజావాణిలో దరఖాస్తు చేసిన రైతులు శుక్రవారం నాడు విచారణకు వచ్చిన పురంధర్ కు డాక్టర్ పై రైతులు పలు అవినీతి ఆరోపణలు చేశారు. సకాలంలో విధులకు హాజరు కాకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పశువులకు వైద్యం చేయకుండా ప్రభుత్వం నుండి వస్తున్న మందులను రైతులకు అందించకుండా బయటకు అమ్ముతున్నాడని, గడ్డి విత్తనాలు మరియు జొన్నలు రైతులకు అందించకుండా పక్కదారి పట్టించారని వస్తే పశువుల ఆసుపత్రికి సంబంధించి సరైన రికార్డు కూడా మెయింటెన్ చేయట్లేదని వచ్చిన ఆరోపణలను విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం జిల్లా పశుసంవర్ధక జాయింట్ డైరెక్టర్ పురంధర్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు

## మీనవోలు ,శ్రీ భాస్కర హై స్కూల్ నందు, ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు.



ఎర్రుపాలెం ప్రజా జ్యోతి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు... బతుకమ్మ ప్రతీక. ప్రకృతితో మమేకమై పల్లె ప్రజలంతా సంబరంగా జరుపుకునే తెలంగాణ రాష్ట్ర ప్రధాన పండుగ నేటి నుంచి ప్రారంభమవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని మీనవోలు , శ్రీ భాస్కర హై స్కూల్ నందు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ముందస్తు గా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో.. ఎంతో భక్తి శ్రద్ధలతో రంగురంగుల బతుకమ్మలను పేర్చి.. బతుకమ్మలను కీర్తిస్తూ కోలాటాలు, నృత్యాలతో సంబరం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని శ్రీ భాస్కర హై స్కూల్ డైరెక్టర్ శ్రీ వెంకటేశ్వరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను అద్భుతంగా నిర్వహించుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఈ దసరా విద్యార్థుల జీవితాలలో , వారి కుటుంబాలలో సరికొత్త వెలుగును ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీ సూర్యనారాయణరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# చేగోమ్మ జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**నేటి ఆటపాటలతో పాఠశాలలో పండుగ సందడి.**

**నేటి నుంచి దసరా సెలవులు**



**పాలేరు ఆర్.సి అక్టోబర్09 ప్రజా జ్యోతి** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని చేగొమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను చేతబట్టి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణమంతా పూల సోయగాలు, విద్యార్థినుల సందడి, పండుగ వాతావరణంతో కళకళలాడింది. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించిన విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బతుకమ్మ చుట్టూ చేరి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహిస్తూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐకమత్యం, సోదరభావం, ప్రకృతి పట్ల ప్రేమ వంటి విలువలను తెలియజేశాయి. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొనడంతో విద్యార్థినులు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది సమక్షంలో విద్యార్థులు సంప్రదాయ పండుగ విశిష్టతను తెలుసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఇదిలా ఉండగా, రేపటి నుంచి దసరా సెలవులు ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో మరింత ఆనందం నెలకొంది. పండుగ వేడుకలతో పాటు సెలవుల సందడి పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులు దసరా పండుగను తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ద్వారా భావితరాలకు మన సంప్రదాయాల గొప్పతనాన్ని పరిచయం చేసినట్లయింది.లిలి ఈ కార్యక్రమంలో చేగొమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ ఇన్చార్జి హెచ్ఎం చంద్రశేఖర్. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గణిశాస్త్ర, సిహెచ్ రవి కిరణ్ వ్యాయామ ఉపాధ్యాయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# టీ.బీ రహిత గ్రామంగా అగ్రహారం గ్రామపంచాయతీ

## ప్రశంస పత్రం అందుకున్న అగ్రహారం సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్




**పాలేరు ఆర్.సి అక్టోబర్ 9 ప్రజాజ్యోతి** టి.బి ముక్త్ బారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కూసుమంచి మండల పరిధిలోని అగ్రహారం గ్రామాన్ని టి.బి రహిత గ్రామంగా అధికారులు ఎంపిక చేశారు. ఖమ్మం నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయంలో సముదాయంలో నిర్వహించిన అభియాన్ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నివేదిత, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ వేణుమాధవ్ , చేతుల మీదుగా అగ్రహారం సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో టిబి పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ గ్రామపంచాయతీని ఆధ్వర్యంలో టీబి నిర్మూలన పూర్తి చేయటం అభినందనీయమని వారు తెలిపారు. గ్రామ సర్పంచ్ మల్లెల స్వాతి ఉపేందర్ మాట్లాడుతూ టీ.బీ నిర్మూలల్లో గ్రామ ప్రజలు వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే టీబీ రహిత గ్రామంగా అగ్రహారం నిలిచిందని తెలిపారు. టీ.బీ రహిత గ్రామంగా ఎంపిక కావటం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో జస్వంత్ కుమార్ ఎంపీ ఓ హనుమంతరావు గ్రామపంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు యువకులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

# టీ.బీ రహిత గ్రామంగా గొరీళ్ళ పాడు తండా గ్రామపంచాయతీ

## ప్రశంస పత్రం అందుకున్న అగ్రహారం సర్పంచ్ బానోత్ సరస్వతి




**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 9 ప్రజాజ్యోతి** టీ.బీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కూసుమంచి మండల పరిధిలోని గొరీళ్ళ పాడు తండా గ్రామాన్ని టి.బీ రహిత గ్రామంగా అధికా రులు ఎంపిక చేశారు. ఖమ్మం నగరంలోని సమీకృత జిల్లా కార్యాల యంలో సముదాయంలో నిర్వహించిన అభియాన్ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నివేదిత, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ వేణుమాధవ్ , చేతుల మీదుగా గొర్లపాడు తండా సర్పంచ్ బానోతు సరస్వతి ప్రశంస పత్రాన్ని అందుకున్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో టిబి పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ గ్రామపంచాయతీని ఆధ్వర్యంలో టీబి నిర్మూలన పూర్తి చేయటం అభినందనీయమని వారు తెలిపారు. గ్రామ సర్పంచ్ బానోతు సరస్వతి మాట్లాడుతూ టీ.బీ నిర్మూలల్లో గ్రామ ప్రజలు వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజల భాగస్వామ్యంతోనే టీబీ రహిత గ్రామంగా గొర్లపాడు తండా నిలిచిందని తెలిపారు. టీ.బీ రహిత గ్రామంగా ఎంపిక కావటం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో జస్వంత్ కుమార్ ఎంపీ ఓ హనుమంతరావు గ్రామపంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు యువకులు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

# యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి

చెడు వ్యసనాలకు, సైబర్ మోసాలకు దూరంగా ఉండాలి

సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలి..

పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**కామారెడ్డి,** విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఈ దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు, సైబర్ మోసాలకు దూరంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాను విచక్షణతో వినియోగించాలని, తెలియని వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, చిన్న వయస్సులోనే తప్పుదోవ పట్టించే అలవాట్లకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీదేవి గార్డెన్‌లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని పోలీస్ కళాబృందం విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ నేటి సమాజంలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

### ప్రేమ పేరుతో మోసాలకు గురికావద్దు

నేటి రోజుల్లో ప్రేమ పేరుతో పరిచయాలు పెంచుకొని యువతను మోసం చేసే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి విషయాల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కార్యక్రమంలో సూచించారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, చిరునామాలు, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అందించవద్దని హెచ్చరించారు. తెలియని వ్యక్తులను గుడ్డిగా నమ్మకుండా, అనుమానాస్పద పరిచయాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.

### మైనర్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు

మైనర్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, వాహనం నడిపేందుకు చట్టబద్ధమైన వయస్సు వచ్చే వరకు మైనర్లు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు చిన్న వయస్సులోనే వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వివరించారు.

### మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని పోలీస్ కళాబృందం సభ్యులు వివరించారు. స్నేహితుల ఒత్తిడికి లోనై చెడు అలవాట్లకు బానిసలు కావద్దని, ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగానికి ప్రోత్సహించినా, వాటి సరఫరాకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మంచి స్నేహాలను ఎంచుకుంటూ క్రీడలు, విద్య, సామాజిక సేవ వంటి సానుకూల కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం, తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పడం, నకిలీ బహుమతులు, ఉద్యోగాల పేరుతో వచ్చే సందేశాలను నమ్మడం వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని వివరించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని బహిరంగంగా పంచుకోవద్దని, నకిలీ ఖాతాలు, తప్పుడు ప్రచారాలు, ఆన్‌లైన్ వేధింపుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు.

### మహిళల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన

మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కార్యక్రమంలో వివరించారు. మహిళలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని తెలిపారు. బాలలపై లైంగిక నేరాల నిరోధానికి ఉద్దేశించిన పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలు తమకు ఎదురయ్యే ఇబ్బందులను దాచిపెట్టకుండా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల సమస్యలను శ్రద్ధగా వినాలని సూచించారు.ఈ సందర్భంగా షీ టీమ్ విధులు, మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను డబ్ల్యూపీసీ సౌజన్య విద్యార్థులకు వివరించారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులకు గురైనా భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, ఆయన బృందం పాటలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతపై అవగాహన

# ఖమ్మం జిల్లా నూతన ఎస్జిఎఫ్ సెక్రటరీగా వై. చిన్ని ఎంపిక



**మధిర ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్జిఎఫ్) నూతన సెక్రటరీగా మధిర మండలం దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు (పి డి)వై. చిన్ని ఎంపికయ్యారు. పాఠశాల స్థాయి క్రీడల అభివృద్ధి, విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఆయన అందించిన సేవలను గుర్తించి విద్యాశాఖ అధికారులు ఈ బాధ్యతలను అప్పగించారు.

### వ్యాయామ ఉపాధ్యాయుల హర్షం

వై. చిన్ని జిల్లా ఎస్జిఎఫ్ సెక్రటరీగా నియమితులవడం పట్ల ఖమ్మం జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం (పిఈటి మరియు పిడి అసోసియేషన్) హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆయనకు ప్రత్యేక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. వై. చిన్ని నేతృత్వంలో ఖమ్మం జిల్లాలో పాఠశాల క్రీడలు మరింత ముందుకు సాగాలని, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఉపాధ్యాయ సంఘం ఆకాంక్షించింది. ఈ సందర్భంగావై. చిన్ని మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడారంగంలో తగిన ప్రోత్సాహం అందిస్తూ, జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో నిలబెట్టేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన అధికారులు, ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపీ యుపిఎస్ లాల్ సింగ్ తండా పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ముఖ్య అతిథిగా లాల్ సింగ్ తండా సర్పంచ్ భూక్య సావిత్రి



**పాలేరు ఆర్.సీ అక్టోబర్ 09 ప్రజా జ్యోతి** ఎంపీ యుపిఎస్ లాల్ సింగ్ తండా పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించ డం జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని బంతి చామంతి మందార పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ సంప్రదాయాలను, సాంస్కృతిక వారసత్వాన్ని విద్యార్థులు కాపాడుతూ భావితరాలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూక్య సావిత్రి కోటేశ్వరరావు, పాఠశాల చైర్మన్ దారావత్ ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, కోటా చారి, గ్రామ పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.